# చెరుకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

- జహీరాబాద్ చెరుకు రైతులకు బకాయిలు చెల్లించాలని ఆదేశాలు
- ఈనెల 15 లోగా రూ.12.05 కోట్లు చెల్లించాలని యాజమాన్యాన్ని ఆదేశించిన మంత్రి హరీశ్‌రావు
- బకాయిలు చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించేందుకు ప్రభుత్వం సిద్ధం
- నివేదిక సమర్పించిన సంగారెడ్డి కలెక్టర్ శరత్



జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో ఉన్న ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ శరత్, ఎమ్మెల్యే మాణిక్‌రావు



ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ

జహీరాబాద్, జూలై 3: తెలంగాణ రాష్ట్రంలో చెరుకు పంటను అధికంగా జహీరాబాద్ డివిజన్‌లోనే సాగు చేస్తారు. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ ఉంది. ఈ ఫ్యాక్టరీ పరిధిలో అధికంగా రైతులు చెరుకు సాగు చేస్తారు. ఫ్యాక్టరీ యాజమాన్యం టన్నుకు రూ.3050 రైతులకు మద్దతు ధర చెల్లిస్తున్నది. గతేడాది 2022-23 సీజన్‌లో రైతులు ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసినా ఇంత వరకు డబ్బులు చెల్లించలేదు. రైతులకు ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.12.05 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఉద్యోగులకు ఆరు నెలల నుంచి జీతాలు కూడా చెల్లించడం లేదు. దీంతో రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖల మంత్రి తన్నీర్ హరీశ్‌రావును హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో షుగర్ కేన్ కమిషన్, కలెక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం హాజరైంది.

**రైతులకు రూ. 12.05 కోట్లు బకాయిలు**

ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం రైతుల నుంచి చెరుకు కొనుగోలు చేసినా డబ్బులు పూర్తిగా చెల్లించలేదు. సీజన్ ముగిసి ఐదు నెలలు గడించినా ఇంతవరకు పెండింగ్ బిల్లులు ఇవ్వలేదు. దీంతో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు చెరుకు రైతుల సమస్యలను మంత్రి తన్నీర్ హరీశ్‌రావు దృష్టికి తీసుకుపోయారు. వెంటనే మంత్రి హరీశ్‌రావు కలిపించుకుని కలెక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్‌తో మాట్లాడి, ఫ్యాక్టరీకి వెళ్లి పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చారు. మంత్రి ఆదేశాలతో జిల్లా అధికారులు ఫ్యాక్టరీని పరిశీలించి, ఎంత చక్కెర నిల్వ ఉంది. ఎంత మొలసిస్ ఉందో పరిశీలించి మంత్రికి నివేదిక పంపించారు. ఫ్యాక్టరీకి 50 ఎకరాల భూమి ఉంది.. ప్యాక్టరీలో రూ.30 కోట్లు యంత్రాలు ఉంటాయని నివేదిక సమర్పించారు. రైతులకు పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు రెవెన్యూ రికవరీ చట్టం ఉపయోగించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం మొత్తం 5 నోటీసులు జారీ చేయాల్సి ఉండగా, ఒక నోటీసును జారీ చేశారు.

**జూలై 15 వరకు బకాయిల చెల్లింపు**

హైదరాబాద్‌లో మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ట్రైడెంట్ యాజమాన్యం జూలై 15 వరకు రైతుల పెడింగ్ బిల్లులు చెల్లిస్తామని లిఖిత పూర్వంగా రాసిఇచ్చారు. గతంలో చెరుకు రైతులకు యాజమాన్యం పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టాం ఉపయోగించి, వాహనలు వేలం వేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెరుకు రైతుల సమస్యలు పరిష్కారం చేసేందుకు ఎప్పుడు ముందు ఉంటుంది. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్‌లు పలుమార్లు మంత్రికి చెరుకు రైతుల సమస్య వివరించడంతో పెండింగ్ బిల్లుల చెల్లించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ శరత్ ఫ్యాక్టరీని పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి సమర్పించడంతో రైతుల సమస్య పరిష్కారం దిశగా ముందుకు పోతుంది. ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన రైతులు పలు మార్లు అధికారులకు పెండింగ్ బిల్లులపై ప్రశ్నంచినా స్పదించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కలిపించుకోవడంతో యాజమాజన్యం పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ముందుకొచ్చారు.

### రైతుల సమస్య పరిష్కరిస్తాం



జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో ఉన్న ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో వెంటనే సమస్యను రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకపోయాం. మంత్రి కలిపించుకుని ఫ్యాక్టరీ యాజమాన్యం, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. జహీరాబాద్ జోన్ పరిధిలో ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరికి చెరుకు సరఫరా చేసిన రైతులకు రూ. 12.05 కోట్లు బకాయిలు ఉన్నారు. ఉద్యోగులకు ఆరు నెల జీతాలు చెల్లించాల్సి ఉంది. రైతులకు, ఉద్యోగులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. ప్రభుత్వం చెరుకు రైతుల సమస్యలు పరిష్కారం చేసేందుకు ఎప్పుడు కృషి చేస్తుంది.

**- కొనింటి మాణిక్‌రావు, ఎమ్మెల్యే జహీరాబాద్**

# స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక

- సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించాలి
- సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 3: స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ముందస్తు ప్రణాళికతో పని చేయాలని సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ రమణకుమార్‌తో కలిసి డీఎస్పీలు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రణాళికతో పని చేయాలన్నారు. గత ఎన్నికల విషయ పరిజ్ఞానంతో జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. సమస్యాత్మక వివరాలు సేకరించి ఈసీఐకి నివేదిక పంపాలన్నారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు తెలుసుకోవాలన్నారు. ఎస్పీ రమణకుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్వో నగేశ్, డీఎస్పీలు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



ఎరుకలి రాములు (ఫైల్)



అవుసలి శ్రీశైలం(ఫైల్)

హత్నూర, జూలై 3: రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ శివారులో ఉన్న ఇమ్మెన్నార్ పరిశ్రమ సమీపంలో నర్సాపూర్- సంగారెడ్డి ప్రధాన రహదారిపై సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నవాబుపేటకు చెందిన అవుసలి శ్రీశైలం(40), ఎరుకలి రాములు (45) సోమవారం బోర్పట్ల శివారులోని మిషన్ భగీరథ పంపుహౌస్‌కు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. హైదరాబాద్‌లోని మియాపూర్ నుంచి మండలంలోని మాధుర శివారులో ఉన్న దత్తాచలక్షేత్రంలో జరుగుతున్న గురుపౌర్ణమి ఉత్సవాలకు వెళ్తున్నారు. ఈక్రమంలో మల్కాపూర్ శివారులోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని సమీపంలో ఉన్న చెట్టు వరకు లాక్కెల్లింది. ఈ ప్రమాదంలో అవుసలి శ్రీశైలం, ఎరుకలి రాములు అక్కడికక్కడే మృతిచెందారు. కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో అందులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన తర్వాత ప్రయాణికులు ఆలయానికి వెళ్లారు. కారు డ్రైవర్ షేక్ అన్వర్ అలీని హత్నూర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాలను నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. మృతుడు అవుసలి శ్రీశైలానికి భార్య రేణుక, కొడుకు, కూతురు, ఎరుకలి రాములుకు భార్య లక్ష్మి, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు.

## 'ఇంటింటా ఇన్నోవేటర్' ఆవిష్కర్తలకు ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జూలై 3: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యావేత్తలు, రైతులు, గృహిణులు, మెకానిక్‌లు ఎవరైనా తమ సృజనాత్మక ఆవిష్కరణలను ఆగస్టు 5వ తేదీలోగా వాట్సాప్ నంబర్ 910067854కు పంపాలని కలెక్టర్ రాజర్షి షా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆవిష్కరణకు సంబంధించి ఆరు వాక్యాలు, రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణ ఫొటోలు నాలుగు, ఆవిష్కర్త పేరు, వృత్తి, చిరునామా, సెల్ నంబర్ పంపించాలని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ వారి ఆధ్వర్యంలో పరిశీలించి, ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి జిల్లా కేంద్రంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ఆవకాశాన్ని ఆవిష్కర్తలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా సమన్వయకర్త రాజిరెడ్డిని(8328599157) సంప్రదించాలని సూచించారు.

## అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జూలై 3: జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే సంక్షేమ గురుకుల (పురుషుల) డిగ్రీ కళాశాలలో బోధించేందుకు అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బాలకిష్టయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బాటనీ, జువాలజీ, కామర్స్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులకు పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్/సెట్/స్లెట్ అర్హత కలగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఓపెన్ కేటాగిరి అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో సుమారు 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ కేటాగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. డిగ్రీ, పీజీ కళాశాలల్లో పనిచేసిన అనుభవం మాత్రమే పరిగణించబడుతుందని పేర్కొన్నారు. కళాశాలలో సబ్జెక్ట్ అవసరాలను బట్టి మెరిట్ ఆధారంగా అభ్యర్థులను డెమోకు పిలువనున్నట్లు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్, స్టాఫ్ నర్సు పోస్టులకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను హవేళీఘనపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే కళాశాలలో ఈనెల 9వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

## జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 3: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2023కు జిల్లాలోని ఉపాధ్యాయులు http:/nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని మెదక్ డీఈవో రాధాకిషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సెట్ల దరఖాస్తు ప్రతులను సంబంధిత యాజమాన్యాల ద్వారా 15వ తేదీలోపు డీఈవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

## నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 3: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అధికారికంగా నిర్వహించనున్నట్లు సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదురుగా హనుమాన్ మందిరం వద్దగల దొడ్డి కొమురయ్య విగ్రహానికి పుష్పాలంకరణ చేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

పటాన్‌చెరు, జులై 3: పాటి గ్రామంలోని ఒక ప్రైవేట్ కళాశాల విద్యార్థి భవనం మూడో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కళాశాల యాజమాన్యం తెలిపిన కథనం ప్రకారం.. ఆ రెసిడెన్షియల్ కళాశాలలో ప్రకాశం జిల్లా సింగరాయకొండ ప్రాంతానికి చెందిన రామ్‌ప్రణిత్ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. నెల క్రితం అతడిని కుటుంబ సభ్యులు పాటిలోని ఈ కళాశాలలో చేర్పించారు. సోమవారం ఉదయం నిర్వహించిన సామర్థ్య పరీక్షలకు హాజరైన తర్వాత తన రూంలోకి వెళ్లాడు. ఆ తరువాత టాయిలెట్స్ వద్దకు చేరి కిటికీ గ్రిల్‌ను బలవంతంగా తొలిగించాడు. కిటికీ లోంచి కిందికి దూకాడు. మూడో అంతస్తు నుంచి దూకడంతో తీవ్ర గాయాలయ్యాయి. అప్రమత్తమైన కళాశాల యాజమాన్యం శేరిలింగంపల్లిలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ప్రస్తుతం రామ్ ప్రణిత్ చికిత్స పొందుతున్నాడని కళాశాల అడ్మిన్ సోమిరెడ్డి తెలిపారు. తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని బీడీఎల్ సీఐ వినాయక్‌రెడ్డి స్పష్టం చేశారు.

## రైలు ఢీకొని యువకుడు మృతి



పోతిన్‌పల్లి బాబు (ఫైల్)

వెల్దుర్తి, జూలై3: రైలు పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మాసాయిపేటలో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మాసాయిపేట గ్రామానికి చెందిన పోతిన్‌పల్లి బాబు (24) సోమవారం అచ్చంపేటకు వెళ్లే దారి వైపు వైన్స్ సమీపంలో రైలు పట్టాలు దాటుతున్నాడు. వేగంగా వచ్చిన రైలు బాబును ఢీకొన్నది. దీంతో బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి రైల్వే దవాఖానకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.